వీధి వీధిలో చవితి సందడి


పెనుకొండలో విక్రయానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు


పరిగిలో విగ్రహాలకు రంగులు వేస్తున్న తయారీదారుడు మంజు


రొళ్లలో వినాయక ప్రతిమలను విక్రయానికి సిద్ధంగా ఉంచిన దృశ్యం

- ఉత్సవాలకు వినాయక ప్రతిమల ముస్తాబు
- గ్రామాల్లో చవితి పందిళ్ల ఏర్పాట్లలో బిజీ

రొద్దం: మరో నాలుగు రోజుల్లో ప్రారంభం కానున్న వినాయక చవితి పండుగను పురస్కరించుకొని రొద్దం మండల వ్యాప్తంగా గ్రామాల నడిబొడ్డున కొలువుదీరేందుకు విభిన్న ఆకృతులతో గణనాథులు సిద్ధమయ్యారు. ఇందుకోసం చవితి పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. నిర్వాహకులు చవితి వేడుకల నిర్వహణలో బిజీ అయ్యారు. మండల కేంద్రంలో అతి పెద్ద మట్టి గణనాథుడు ఈనెల 27 కొలువు దీరనున్నారు. రెండు నెలలుగా మట్టి గణపయ్య విగ్రహాన్ని తయారు చేస్తున్నారు. ప్రకృతి ఆరాధనతో మొదలైన పూజలు..ప్రస్తుతం విగ్రహారాధన వరకూ వచ్చింది. సాధారణంగా మిగతా దేవతా మూర్తుల విగ్రహాలను కళాకారులు రాయితో మలుస్తారు. అయితే వినాయక చవితి ఉత్సవాల అనంతరం స్వామివారి విగ్రహాన్ని నిమజ్జనం చేయాల్సి ఉన్నందున కళాకారులు మట్టి గణపయ్యలను తయారు చేస్తున్నారు. ఇటీవల కాలంలో విగ్రహాల ఏర్పాటు సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. జిల్లాలో వేల విగ్రహాలను మంటపాల్లో ఏర్పాటు చేస్తున్నారు. ఈ విగ్రహాల వల్ల పర్యావరణానికి పెనుముప్పు సంభవించే ప్రమాదంఉందని పర్యావరణ ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు. కొంత మార్పు తెచ్చిన పర్యావరణ ప్రేమికులు మట్టి గణపయ్యలను ఏర్పాటు చేసుకోవడానికి ముందుకు వస్తున్నారు. దీంతో రొద్దం మండల కేంద్రంలో రెండేళ్లుగా పెద్ద మట్టి గణపయ్యను ఏర్పాటు చేస్తున్నారు.

కొంతలో కొంత మార్పు..

వినాయక చవితి సందర్భంగా ఇళ్లల్లో కొలువుదీర్చే గణపయ్యలను ముఖ్యంగా విద్యావంతులు, పర్యావరణ ప్రేమికులు మట్టితో చేసిన విగ్రహాలనే ఏర్పాటు చేసి పూజలు చేస్తున్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో కళాకారులు మట్టితో చిన్న విగ్రహాలను తయారు చేస్తున్నారు. ప్రస్తుతం వినాయక చవితి పండుగకు అతి తక్కువ సమయం ఉండటంతో వ్యాపారులు మట్టితో తయారు చేసే విగ్రహాలకు డిమాండ్ కూడా ఉంది. వీధుల్లో, గ్రామాల్లో ఏర్పాటు చేసే భారీ గణపయ్యలను కూడా మట్టితో చేసే విగ్రహాలనే ఏర్పాటు చేసేలా ప్రభుత్వం ప్రోత్సహించాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

ఉత్సవాలకు ముస్తాబైన గణనాథులు

మడకశిర: వినాయక చవితి ఉత్సవాలకు గణనాథుల విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. ఈ నెల 27న వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. వాడవాడలా వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు నిమగ్నమయ్యారు. దీంతో మడకశిర పట్టణంలో వినాయక విగ్రహాలను అమ్మకానికి సిద్ధమయ్యాయి. గతంలో వినాయక విగ్రహాలను ఇతర ప్రాంతాలలో తయారు చేసేవారు. ఈ సారి పట్టణంలోని బస్టాండ్ సమీపంలో రాజస్థాన్ చెందిన కిషోర్, కిరణ్ కుటుంబ సభ్యులు వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నారు. శివమొగ్గ, తుమకూరు తదితర ప్రాంతాల నుంచి విగ్రహాల తయారీదారులను రప్పించి మడకశిర మండలంలోని అగ్రంపల్లిలో వివిధ ఆకృతులలో వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నారు. మూడు నుంచి 25 అడుగుల వరకూ వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నారు. ఈ సారి వినాయక విగ్రహాలకు భారీ డిమండ్ ఉన్నట్లు తయారీదారులు తెలిపారు.

బొజ్జ గణపయ్యలు సిద్ధం

రొళ్ల: వినాయక చవితిని పురస్కరించుకుని గ్రామాల్లో యువకులు భక్తిశ్రద్ధలతో బొజ్జ గణపయ్యలను ఏర్పాటు చేయనున్నారు. తయారీదారులు ఇప్పటికే వినాయక విగ్రహాలను సిద్ధం చేసి ఉంచారు. భక్తుల మనసు దోచుకునే వివిధ ఆకృతుల్లో కొలువుదీరేందుకు బొజ్జ గణపయ్యలను సిద్ధంగా ఉంచడం విశేషం. రొళ్ల పట్టణానికి చెందిన కుమ్మరి జంగమప్ప చిన్నతనం నుంచి మట్టి కుండలు తయారు చేసి విక్రయించి దాని ద్వారా వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తూ వచ్చారు. అతడి కుమారుడు శివప్రసాద్ అదే వృత్తిని నమ్ముకుని గణపతి బొమ్మలు తయారు చేస్తూ ముందుకు సాగుతున్నారు. ఏటా నెల రోజులు ముందుగానే బొజ్జ గణపయ్యల కోసం వినాయక కమిటీ సభ్యుల నుంచి ఆర్డర్ తీసుకుంటూ విగ్రహాలను తయారు చేస్తారు. మండలతోపాటు, నియోజకవర్గంలోని ఐదు మండలాలు, సమీపాన కర్ణాటక ప్రాంతాల నుంచి కూడా ఏటా వందల సంఖ్యలో వినాయక విగ్రహాలను కమిటీ సభ్యులు వచ్చి తీసుకువెళుతుంటారని ఆయన తెలిపారు.

శాస్త్రీయంగా కూడా శ్రేష్టమైనది



మట్టి విగ్రహాలను పూజించడం శాస్త్రీయంగా కూడా శ్రేష్టమైనది. అంతేకాక మట్టి విగ్రహాలను తయారు చేసేవారు చాలా నియమ, నిష్టలతో విగ్రహాలను తయారు చేస్తారు. నిష్టతో తయారు చేసిన విగ్రహాలను పూజిస్తే చాలా మంచిది. మేము రొద్దంలో రెండేళ్ల నేంచి మట్టి గణపయ్యను ఏర్పాటు చేస్తున్నాం.

– వేణుగోపాల్, వినాయక కమిటీ సభ్యుడు, రొద్దం

అనుమతులు తప్పనిసరి



ఈనెల 27న వినాయక చవితి పండుగ సందర్భంగా గ్రామాల్లో మంటపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి తీసుకోవాలి. మంటపాల కమిటీ సభ్యులు అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలి. రద్దీ ప్రాంతాల్లో విగ్రహాల ఏర్పాటుకు పంచాయతీ అనుమతి తీసుకోవాలి. ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి. మైకులు, డీజేలు ఏర్పాటుకు పోలీస్ స్టేషన్ నుంచి అనుమతి తప్పనిసరి.

– నరేంద్ర, రొద్దం ఎస్ఐ

భక్తిశ్రద్ధలతో 'శ్రావణ' పూజలు


ఉగ్ర నరసింహుడిగా పేట వెంకటరమణస్వామి


అమరాపురం: ఆలదపల్లిలో హారతులు తీసుకెళ్తున్న మహిళా భక్తులు

హిందూపురం: శ్రావణ మాసం చివరి శనివారం సందర్భంగా పట్టణంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. మెయిన్‌బజార్ పేట వేంకటరమణ స్వామి ఆలయంలో స్వామిని ఉగ్రనరసింహుడిగా అలంకరించి పూజలు చేపట్టారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత స్వామి ఉత్సవమూర్తులను పల్లకీపై కొలువుదీర్చి మంగళ వాయిద్యాలతో ప్రాకారోత్సవం నిర్వహించారు. విద్యనగర్‌లోని లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయం, కోట ప్రాంతంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక చేశారు. డిబికాలనీ, టీచర్స్‌కాలనీలోని శనేశ్వరస్వామి ఆలయాల్లో మూలవిరాట్‌కు తిలతైలాభిషేకాలు నిర్వహించారు.

మడకశిర: చివరి శ్రావణ శనివారం సందర్భంగా పట్టణంలోని ప్రధాన ఆలయాలకు భక్తులు పోటెత్తారు. షిరిడీ సాయిబాబా ఆలయంలో శ్రీచక్రపూజలు ముగిశాయి. శనీశ్వరస్వామి ఆలయంలో శనేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు, అభిషేకాలు జరిపారు. మిట్టబండ ఆంజనేయ, చంద్రమౌళీశ్వర, కన్యకాపరమేశ్వరి, వేంకటరమణస్వామి ఆలయాల్లో పూజలు జరిపారు.

మడకశిరరూరల్: మండలంలోని భక్తరహళ్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లెడుగుంట అంజినేయస్వామి , నీలకంఠేశ్వరస్వామి, కల్లుమర్రి వీరకేతమ్మ, చెందకచెర్లు ఆంజనేయస్వామి, జమ్మానిపల్లి లక్ష్మీనిడిమామిడమ్మ తదితర ఆలయాల్లో స్వామివార్లకు శ్రావణమాసం చివరి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కదిరేపల్లిలో శనీరస్వామికి మహిళలు జ్యోతుల ఉత్సవాలు నిర్వహించారు.

అమరాపురం: శ్రావణమాసం చివరి శనివారం సందర్భంగా శనీశ్వరస్వామికి భక్తులు పూజలు, హారతులు నిర్వహించారు. మండలంలోని ఆలదపల్లి, బవసన పల్లి, అమరాపురం గ్రామాల్లో శనీశ్వరస్వామికి అర్చకులు సుప్రభాతసేవ, నవగ్రహ పూజ, పంచామృతాభిషేకం, తదితర పూజలు చేశారు. సాయంత్రం మహిళలు పిండితో తయారు చేసిన హారతులను కలశాలతో డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా ఆలయం చేరుకున్నారు. అక్కడ దేవాలయం చుట్టు ప్రదక్షిణలు చేసి స్వామి వారికి హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

అగళి: మండలంలోని కందపల్లిలో శనేశ్వరస్వామికి, పలు గ్రామాల్లోని ఆంజనేయస్వామికి గ్రామస్తులు శ్రావణ మాస శనివారం సందర్భంగా భక్తి శ్రద్ధలతో జ్యోతుల ఉత్సవం నిర్వహించారు.

రొళ్ల: ఆవినకుంట, కేజీ గుట్ట, జీబీ హళ్లి, రొళ్లకొండ తదితర గ్రామాలకు చెందిన మహిళలు నియమనిష్టలతో జ్యోతులను మేళతాళాలతో ఊరేగింపుగా రొళ్లలో ఆలయం వద్దకు చేరుకుని శనేశ్వరస్వామి ప్రతిమ చుట్టూ ప్రదక్షిణలు చేశారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి


ఎస్ఎంయూఏ నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

మడకశిర: ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని ఎస్ఎంయూఏ జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి తెలిపారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం ఎస్ఎంయూఏ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకం అమలు వల్ల డ్రైవర్లు, కండక్టర్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యలను పరిష్కరించడానికి ఎస్ఎంయూ రాష్ట్ర కమిటీ సభ్యులు కృషి చేస్తున్నారన్నారు.ఆర్టీసీ కార్మికులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా మడకశిర ఆర్టీసీ డిపో ఎస్ఎంయూ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నారాయణ, కార్యదర్శిగా కరియప్ప, కోశాధికారిగా బీఎస్ నాయక్, సహ కార్యదర్శిగా వెంకటేశ్, ఉపాధ్యక్షుడిగా సుదర్శన్, ప్రచార కార్యదర్శిగా కార్తీక్, గ్యారేజ్ కమిటీ అధ్యక్షుడిగా రాము, కార్యదర్శిగా బాబు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రీజనల్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరామ్ నాయక్, షబ్బీర్, ఉపధ్యక్షుడు వలీసాబ్, స్థానిక ఎస్ఎంయూ నాయకులు రామక్రిష్ణ, సుబ్బరాయుడు, జయసింహ, ముద్దప్ప, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

సచివాలయానికి ప్రింటర్ వితరణ


ప్రింటర్ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కె.బ్యాడిగెర లోకేష్

రొళ్ల: మండలంలోని కాకి సచివాలయంలో కొత్తగా ఏర్పాటైన ఆధార్ నమోదు సెంటర్‌కు శనివారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కె.బ్యాడిగెర లోకేష్ ప్రింటర్‌ను (వితరణ) అందజేశారు. ఆయన మాట్లాడుతూ కాకి సచివాలయంలో కొత్తగా ఆధార్ సెంటర్ ఏర్పాటు కావడం పట్ల సంతోషంగా ఉందన్నారు. ఆధార్ సెంటర్‌కు వచ్చే ప్రజలకు ప్రింటర్ ఉపయోగపడుతుందని తెలిపారు. సచివాలయం సిబ్బంది, ప్రజలు లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి రచన, సచివాలయం సిబ్బంది రవికుమార్, కిరణ్‌కుమార్, పార్టీ నాయకుడు యరగుంటప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి జ్యోతుల ఉత్సవం


జ్యోతులతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

గుడిబండ: మండలంలోని ఫళారం గ్రామంలో ఆంజనేయుడికి జ్యోతుల ఉత్సవాన్ని శ్రావణ మాసం చివరి శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు బియ్యం పిండితో చేసిన జ్యోతులను మేళతాళాలు, వాయిద్యాల నడుమ గ్రామంలో ఊరేగింపుగా తీసుకువచ్చి విగ్రహం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి స్వామి వారికి జ్యోతులను సమర్పించారు. భక్తులకు అన్నదానం చేశారు.

పోటాపోటీగా ఎన్నికలు

పావగడ: తుమకూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ డైరెక్టర్ స్థానానికి పోటాపోటీగా ఎన్నికలు జరగనున్నాయి. కాంగ్రెస్ నుంచి స్థానిక ఎమ్మెల్యే, తుముల్ అధ్యక్షుడు హెచ్‌వీ వెంకటేశ్, జేడీఎస్ నుంచి ఆ పార్టీ తాలూకా అధ్యక్షుడు ఎన్ఏ ఈరణ్ణ నువ్వా నేనా అనే రీతి లో తలపడు తున్నారు. ఈ ఎన్నికలు తుమకూరులో ఆదివారం జరుగనున్నాయి. ఇప్పటికే అభ్యర్థులు ఇద్దరూ తమదైన శైలిలో ప్రచారం సాగించారు. వెంకటేశ్ తరఫున అతని తండ్రి మాజీ మంత్రి వెంకటరమణప్ప, ఈరణ్ణ తరఫున జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆర్సీ అంజినప్ప, స్థానిక మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప ప్రచారం చేశారు. ఇదిలా వుంటే తాలూకా వ్యాప్తంగా 20 వీఎస్ఎస్ఎన్ సంఘాలు ఉన్నాయి. ఈ సహకార సంఘాల్లో 20 మంది సభ్యులను డెలిగేట్లుగా ఎంపిక చేస్తారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం


చాంబర్ వద్ద గదిని శుభ్రం చేస్తున్న అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ

హిందూపురం: పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరంగా ఉంటాయని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ అన్నారు. శనివారం స్థానిక న్యాయస్థానాల్లో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా న్యాయమూర్తులు, సిబ్బంది చీపుర్లు చేతబట్టి కోర్టు పరిసరాలతోపాటు గదులను శుభ్రం చేశారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

లేపాక్షి: స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ కార్యాలయ ఆవరణాన్ని శనివారం శుభ్రం చేశారు. తహసిల్దార్ సౌజన్యలక్ష్మితో పాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి

పెనుకొండ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ తెలిపారు. శనివారం పట్టణంలోని కళాశాలలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మూర్తి, రామచంద్రయ్య, చాంద్‌బాషా, ఎన్ఎస్ఎస్ పీఓలు శివణ్ణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రొద్దం: మండల కేంద్రంలో స్వచ్ఛాంధ్ర..స్వర్ణాంధ్ర కర్యక్రమం నిర్వహించారు. శనివారం స్థానిక ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాల ఆవరణలో పారిశుధ్యంపై అవగాహన కల్పించారు.

సత్ప్రవర్తనతో మెలగాలి


మాట్లాడుతున్న న్యాయమూర్తి వెంకటేశ్వర్లు నాయక్

హిందూపురం: జైలు నుంచి బయటకు వెళ్లిన తర్వాత సత్ప్రవర్తనతో మెలగాలని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్ ఖైదీలకు సూచించారు. శనివారం స్థానిక సబ్‌జైలును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్‌జైలులోని ఖైదీలతో ముఖాముఖి మాట్లాడారు. అనంతరం ఖైదీలకు తయారు చేసిన భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జైలు గదులు, వంట గది, నిత్యావసర సరుకుల నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో సబ్‌జైలర్ హనుమన్న, న్యాయవాది నవేరా, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి, పారా లీగల్ వలంటీర్ మాళప్ప తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో తీవ్ర పరిణామాలు

హిందూపురం టౌన్: మత్తు పదార్థాలతో మనిషికి తీవ్ర పరిమాణామాలు సంభవిస్తాయని ప్రభుత్వ ఆస్పత్రి సైకియాట్రిక్ డాక్టర్ జీవన తెలిపారు. శనివారం విప్రో కేర్స్ సహకారంతో వాసవ్య మహిళా మండలి, కుశల్ ఆరోగ్య కేంద్రం తూమకుంట వారి ఆధ్వర్యంలో ఎల్ఆర్‌జీ కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వల్లే కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ బ్రహ్మానందచారి, డైరెక్టర్ ప్రసాద్, కుశల్ క్లీనిక్ డాక్టర్ సల్మా, మరియమ్, కోఆర్డినేటర్ శిరీష్, లలిత పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

పావగడ: తాలూకాలోని 66–116 కేవీ పావగడ, వెంకటాపురం, శైలాపురం, నాగలమడక, మంగళవాడ, కిలార్లహళ్లి, లింగదహళ్లి, వైఎన్ హొసకోట, 220–66–11 కేవీ పావగడ ఉప కేంద్రాల్లో మరమ్మతుల నేపథ్యంలో 11 కేవీ ఫీడర్లలో ఆదివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని స్థానిక బెస్కాం ఏఈఈ కృష్ణమూర్తి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పావగడ తాలూకాకు చెందిన విద్యుత్ వినియోగ దారులు, ప్రజలు సహకరించాలన్నారు.

'అవకతవకలకు పాల్పడితే చర్యలు'

రొళ్ల: నిత్యావసర సరుకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ షేక్షావలి హెచ్చరించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఎఫ్‌పీ షాపుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ 65 ఏళ్ల పైబడిన వృద్ధులకు ఈ నెల 26 నుంచి 30వ తేదీలోపు సరుకులు పంపిణీ చేయాలన్నారు. అనంతరం ఉత్తమ అవార్డు అందుకున్న తహసీల్దార్ షేక్షావలిని డీలర్లు శాలువా కప్పి, పూలమాల వేసి సన్మానించారు. కార్యక్రమంలో సివిల్‌సప్లై డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, డీలర్ల సంఘం అధ్యక్షుడు ఉమేష్, డీలర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

పార్టీ బలోపేతమే లక్ష్యం


మాట్లాడుతున్న సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిరరూరల్: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా పని చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప సూచించారు. శనివారం జీవీపాళ్యం పంచాయతీకి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు ఆయనను కలిసి గ్రామ కమిటీ జాబితాను అందజేశారు. ఆయన మాట్లాడుతూ అన్ని పంచాయతీ కేంద్రాల్లో ఆదివారం గ్రామ కమిటీ సభ్యులు, నాయకులు రచ్చబండ కార్యక్రమం నిర్వహించి ప్రజా సమస్యలు, వివిధ పథకాల్లో జరుగుతున్న అవకతవకలు, గతంలో పనులు చేసినా మంజూరు కాని బిల్లు తదితర వాటిపై చర్చించి తీర్మానం చేయాలన్నారు. గ్రామ కమిటీల సభ్యుల పాత్ర పార్టీకి కీలకమన్నారు. అనంతరం రచ్చబండ కార్యక్రమం సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, తిప్పేస్వామి, షాయిద్, చాంద్‌బాషా, పూల మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు ఫోర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది చేపట్టారు. ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది?, నివారణకు ఎలాంటి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్న అంశాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఫోర్డ్ డైరెక్టర్ బదరీష్,మేనేజర్ అశ్వత్థనారాయణ, హెచ్ఎంలు శకుంతల,రామాంజనమ్మ, పీఈటీ అంబిక,ఫోర్డ్ సిబ్బంది లక్ష్మీదేవి, గాయత్రి, శశికళ, ఐసీటీసీ సిబ్బంది పాల్గొన్నారు.

కౌన్సిలర్ నాగేంద్రబాబుకు పరామర్శ


కౌన్సిలర్‌ను పరామర్శిస్తున్న వేణురెడ్డి

చిలమత్తూరు: పట్టణంలోని 24వ వార్డు కౌన్సిలర్ ఆడిటర్ నాగేంద్రబాబు తండ్రి నారాయణస్వామి శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి కౌన్సిలర్ ఇంటికి వెళ్లి నారాయణ స్వామి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కౌన్సిలర్ నాగేంద్ర బాబుకు ధైర్యం చెప్పి ఓదార్చారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జబిఉల్లా, ఫ్లోర్ లీడర్ ఆసిపుల్లా, కౌన్సిలర్లు రామచంద్ర, నాయకుడు ద్వారకానాథ్‌రెడ్డి ఉన్నారు.

ఉత్తమ అధికారులకు సన్మానం

అగళి: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డులు అందుకున్న తహసీల్దార్ సుబ్బరావు,ఆర్ఐ చంద్రశేఖర్‌రావు, వీఆర్‌ఓ నరసింహమూర్తి, వీఆర్ఏలు మంజునాథ్, రాజును తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. వారు మరిన్ని అవార్డులు అందుకోవాలని నాయకులు ఆకాంక్షించారు.

సురవరం మృతి తీరనిలోటు

పెనుకొండ: సీపీఐ నేత సురవరం సుధాకర్‌రెడ్డి మృతి తీరనిలోటు అని ఆపార్టీ నాయకుడు శ్రీరాములు అన్నారు. శనివారం పట్టణంలోని కృష్ణదేవరాయ కాలనీలో సురవరం సుధాకరరెడ్డి మృతికి సీపీఐ నాయకులు శ్రీరాములు నేతృత్వంలో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ కమ్యూనిస్ట్ యోధుడు సురవరం సుధాకరరెడ్డి మరణం పార్టీకి తీరని లోటన్నారు.

అర్హత ఉన్నవారందరికీ డ్రిప్


మాట్లాడుతున్న పీడీ సుదర్శన్

హిందూపురం: అర్హులందరికీ ఏపీ సూక్ష్మ వ్యవసాయం ద్వారా డ్రిప్, స్ప్రింక్లర్లు అందిస్తామని ఏపీ ఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుదర్శన్ అన్నారు. శనివారం హిందూపురం మండలంలోని నక్కలపల్లిలో రైతులకు అందించిన డ్రిప్ పరికరాల పనితీరును ఆయన పరిశీలించి సూచనలు, సలహాలిచ్చారు. అనంతరం ప్రెస్ క్లబ్‌లో సూక్ష్మ వ్యవసాయ సదుపాయలను ఆయన వివరించారు. ఈ ఏడాది జిల్లాకు 14 వేల హెక్టార్లలో డ్రిప్, స్ప్రింక్లర్స్ ఏర్పాటు చేసేందుకు లక్ష్యం నిర్దేశించగా ఇప్పటికే 1400 హెక్టార్లకు డీడీ కట్టించి 559 హెక్టార్లకు కలెక్టర్ ద్వారా అనుమతులు పొందామన్నారు. అవసరమైన వారు రైతు సేవా కేంద్రాల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

ఘనంగా టంగుటూరి జయంతి


గ్రంథాలయంలో జయంతి వేడుకలను నిర్వహిస్తున్న సిబ్బంది

లేపాక్షి: స్థానిక తహసీల్దార్ కార్యాలయం, శాఖా గ్రంథాలయంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రకాశం పంతులు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, గ్రంథాలయాధికారి మల్లికార్జున టంగుటూరి సేవలను కొనియాడారు.

అగళి: దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ధైర్యసాహసాలు స్ఫూర్తిదాయకమని తహసీల్దార్ సుబ్బరావు అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం టంగుటూరి జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ చంద్రశేఖర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

రొళ్ల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో శనివారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ షేక్షావలి, సీనియర్ అసిస్టెంట్ ఉమామంజునాథ్‌రావు, జూనియర్ అసిస్టెంట్ రఫీక్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

పెనుకొండ రూరల్: వినాయక ఉత్సవ కమిటీలు, నిబంధనలు తప్పక పాటించాలని ఆర్డీవో ఆనంద్ కుమార్ ఆదేశించారు. స్థానిక భువన విజయంలో ఉత్సవ నిర్వాహకులతోపాటు అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ నరసింగప్ప మాట్లాడుతూ విగ్రహాలు ఏర్పాటు చేసే వారు ముందుగా పోలీసుల అనుమతి పొందాలన్నారు. తహసీల్దార్ స్వాతి, సీఐ రాఘవన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మడకశిర: మడకశిర మున్సిపాలిటీ పరిధిలో గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా చేసుకోవాలని అర్బన్ సీఐ నగేష్ కోరారు.స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మున్సిపల్ చైర్మన్ నరసింహరాజు అధ్యక్షతన శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ 11 రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలను ప్రశాంతంగా జరపడానికి ఉత్సవాల కమిటీ సభ్యులు పోలీసులకు సహకరించాలన్నారు. మున్సిపల్ చైర్మన్ నరసింహరాజు, మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్, ఫైర్ ఆఫీసర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'రచ్చబండ'

అమరాపురం: మండలంలోని 11 పంచాయతీల్లో ఆదివారం ఉదయం 11 గంటలకు రచ్చబండ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ శనివారం తెలిపారు. కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

రొళ్ల: మండలంలోని పది పంచాయతీ కేంద్రాల్లో ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ'లో భాగంగా రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి శనివారం పేర్కొన్నారు. పార్టీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాల సభ్యులు, సోషల్ మీడియా సభ్యులు , పార్టీ శ్రేణులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమానికి మండల ఇన్‌చార్జ్ నాగమణితో పాటు జిల్లా, రాష్ట్ర స్థాయి పార్టీ నాయకులు హాజరవుతారన్నారు.

అర్హులకు న్యాయం చేయాలి

పెనుకొండ రూరల్: వెరిఫికేషన్ పేరుతో అర్హులైన పింఛన్‌దారులను తొలగించడం సరికాదని బహుజన ఐక్యవేదిక నాయకులు ఆర్డీవో ఆనంద్ కుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ గతంలో సదరంలో పొందిన ధ్రువీకరణ పత్రం ఆధారంగానే పింఛన్ పొందుతున్నారన్నారు. అర్హులందరినీ తొలగించడం సరికాదన్నారు. నాయకులు శివరామకృష్ణ, నరసింహులు, రామాంజనేయులు, ఈశ్వర్, మారతి, శేషాద్రి పాల్గొన్నారు.